క్లుప్తంగా

ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కొండంత అండ

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కొండంత అండ అని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట, వెల్జిపూర్, ఎర్రనర్సుపల్లి, పెద్దలింగాపూర్, రామోజీపేట, దాచారం గ్రామాల్లో ఆదివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోని ప్రభుత్వాలు ఆడబిడ్డల పెళ్లిళ్లకు నయాపైసా సాయం చేయలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ సీఎం అయ్యాకనే కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్ష 116 సాయం అందిస్తున్నారన్నారు. అనంతరం పెద్దలింగాపూర్ గ్రామంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. మిగిలి ఉన్న పనులన్నీ త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. రైతుబంధు పథకం ద్వారా రైతులకు ఎకరాకు రూ.10 వేల సాయం అందించి అండగా ఉంటున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగు నీరందించడం జరుగుతుందన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, సర్పంచులు జితేందర్, పర్శరాం, రజిత, మేఘలవ్వ, పర్శరాం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలు బీజేపీవైపు



మల్లారంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బీఆర్‌ఎస్‌పై విసుగు చెంది ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీవైపు ఉంటారని తమిళనాడుకు చెందిన విస్తారక్ కొంబయ్య అన్నారు. వేములవాడ రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో మండలంలోని మల్లారం, లింగంపల్లి, జయవరం గ్రామాల కేంద్రం మల్లారంలో ఇంటింటికి పర్యటించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జిగా తమిళనాడుకు చెందిన కొంబయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలంలో 7 శక్తికేంద్రాలు, 24 బూత్ కమిటీలు చురుకుగా పనిచేస్తున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బూత్ స్థాయి కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, మండల కార్యవర్గసభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గడప గడపకూ ధర్మ సమాజ్



స్టెన్సిల్స్ వర్క్స్ చేస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని మర్లపేట, దేశాయిపల్లి గ్రామాల్లో ధర్మ సమాజ్ పార్టీ స్టెన్సిల్స్ పనులు ఉత్సాహంగా సాగుతున్నట్లు డీఎస్పీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు ఎడపెల్లి బాబు తెలిపారు. ఆదివారం మర్లపేటలో పార్టీ స్టెన్సిల్స్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో గడప గడపకు ధర్మ సమాజ్ పార్టీని పరిచయం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, బడుగులకు రాజ్యాధికారం తీసుకురావడం పార్టీ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో కొమ్ము విక్రమ్, కుర్మ సురేశ్, కదుదుల మధు పాల్గొన్నారు.

బో'నమో' పోచమ్మ



వేములవాడ: నెత్తిన బోనంతో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి

వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని కోరుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పించుకున్నారు. వేములవాడ సుభాష్‌నగర్ ఎస్సీ కాలనీ, న్యూఅర్బన్‌కాలనీ, నాంపల్లి, బోయినపల్లి మండలంలోని తడగొండ, దేశాయిపల్లి, సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు, చందుర్తి మండలం లింగంపేటలో పెద్ద ఎత్తున మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లు, బైండ్లోళ్ల ఆటపాటలతో పోచమ్మ ఆలయంకు తరలివెళ్లి బోనం మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లా పాపలు చల్లగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని మొక్కుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మహిళలతో కలసి నెత్తిన బోనం ఎత్తుకుని పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. బీఎస్‌ఆర్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు జడల లక్ష్మి, నీలం కళ్యాణి, లింగంపల్లి సత్యనారాయణ, సర్పంచులు, సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాస్‌రావు, రుద్రంగి ఏఎంసీ మాజీ అధ్యక్షుడు దప్పుల ఆశోక్, నాయకులు పాల్గొన్నారు.

– వేములవాడ/వేములవాడఅర్బన్/బోయినపల్లి/సిరిసిల్లఅర్బన్/చందుర్తి



వేములవాడఅర్బన్: నాంపల్లిలో పోచమ్మ బోనాలలో నాయకులు



బోయినపల్లి: దేశాయిపల్లి బోనాలలో విన్యాసాలు

శిథిలావస్థలో పశువైద్యశాలలు

- ఇన్‌చార్జీలతోనే విధులు
- ఏళ్లుగా నియామకాలు కరువు
- పట్టించుకోని అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ నియోజకవర్గంలో పశువైద్యశాలల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాలు నేటికీ అలాగే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న భవనాల్లోనే డాక్టర్లు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వైద్యాధికారులు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉన్న ఉద్యోగులు, ఇన్‌చార్జీలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, వేములవాడరూరల్, అర్బన్ మండలాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.



శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

ఏళ్లుగా శిథిలావస్థలో..

పశువైద్యశాలల కోసం గత ప్రభుత్వాలు నిర్మించిన భవనాల్లో నేటికీ అలాగే కొనసాగుతున్నాయి. వేములవాడ పట్టణంతో పాటు కోనరావుపేట మండలాలతో పాటు శాత్రాజుపల్లి, నూకలమర్రి గ్రామాల్లో ఉన్న పశువైద్యశాలలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. రుద్రవరం, చందుర్తి మండలాలతో పాటు వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన పశువైద్యశాలలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ఇన్‌చార్జీలతోనే కాలం వెల్లదీస్తున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలలో నిజామాబాద్ పశువైద్యశాలలో ఉన్న వైద్యాధికారే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలలో మానాల మండల కేంద్రంలో ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. వేములవాడ పట్టణంతో పాటు కోనరావుపేటలో ఉన్న పశువైద్యశాలలకు ఒక్కరే కొన్ని నెలలుగా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

అదనపు బాధ్యతలు

వేములవాడ నియోజకవర్గంలోని మండలాల్లో ఉన్న పశువైద్యశాలలకు ప్రత్యేకంగా వైద్యాధికారులు లేకపోవడంతో ఉన్న వైద్యాధికారులనే ఇన్‌చార్జీలుగా నియమించారు. వేములవాడ మండలంతోపాటు మానాల, హన్మాజీపేట, కోనరావుపేట మండలాల్లో ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారు.

ఏళ్లుగా ఇక్కడే విధులు

వేములవాడ పట్టణంలో విధులు నిర్వహిస్తున్న పశువైద్యాధికారి చాలా ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ఈ పశువైద్యశాలలో దాదాపు 14 ఏళ్లుగా ఆయన ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఈ మండలం నుంచి బదిలీ చేయండి మహాప్రభూ అంటూ ఆయన పలుసార్లు జిల్లా అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ ఆయనను బదిలీ చేయకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. మండలంతో పాటు మరికొన్ని ప్రాంతాలకు ఆయనను అదనపు బాధ్యతలను అప్పగించడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు ప్రత్యేక సమావేశాలు, తనిఖీలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు తదితర విషయాల్లో కూడా ఈ అధికారులనే కేటాయించడంతో వారు ఎక్కడ న్యాయం చేయలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

కొత్త భవనాలు నిర్మించాలి



వేములవాడ మండలంతో పాటు చాలా మండలాల్లో పశువైద్యశాలలు పూర్తిస్థాయిలో లేవు. గత ప్రభుత్వంలో నిర్మించినవే తప్పా తెలంగాణ ప్రభుత్వంలో ఇప్పటి వరకు నిర్మించలేదు. వెంటనే అధికారులు స్పందించి నూతనంగా పశువైద్యశాలలను నిర్మించాలి.

– పకుశాభరణం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

సిబ్బందిని కేటాయించాలి



మా వార్డులో ఎన్నో ఏళ్ల క్రితం పశువైద్యశాలను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సిబ్బందిని కేటాయించ లేదు. అలాగే మా వార్డులో ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. దీనిని కొత్త భవనం నిర్మించి పూర్తిస్థాయిలో సిబ్బందిని కేటాయించాలి.

– కొప్పెర వెంకట్‌రెడ్డి, రైతు, శాత్రాజుపల్లి

ప్రతిపాదనలు పంపాం



నూతన భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. శిథిలావస్థలో ఉన్న ఈ భవనంలో విధులు నిర్వహించాలంటేనే భయం భయంగా గడుపుతున్నాం. దీంతో పాటు అదనపు బాధ్యతలు నిర్వహించడం ఇబ్బంది అవుతోంది.

– ప్రశాంత్, పశువైద్యాధికారి, వేములవాడ

విధులకు గైర్హాజరైనా ప్రధానోపాధ్యాయుడికి మెమో

సాక్షి ఎఫెక్ట్

చందుర్తి: మండలం జలపతి తండాకు చెందిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కు మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు శనివారం మెమో జారీ చేసినట్లు తెలిసింది. ఈ నెల 1న 'బడిబాటకు ఏమైంది.?' అన్న శీర్షికన ప్రచురితమైన సాక్షి కథనానికి మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు స్పందించారు. విధులకు వంతులవారీగా హాజరువుతున్న ఆరోపణలు మేరకు అధికారులు స్పందించారు. బయోమెట్రిక్ వినియోగించక పోవడంపై కారణాలు పలు అంశాలపై ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరినట్లు తెలిసింది. కాగా శనివారం సాక్షి ప్రచురితమైన వార్తకు విద్యాశాఖ అధికారులే కాకుండా చాలా గ్రామాల్లోని యువకులు, ప్రజాప్రతినిధులు వారి గ్రామాల్లో చాలామంది ఉపాధ్యాయులు గైర్హాజరు అవుతున్నారని సాక్షి దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపై జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టి సారించాలని కోరుతున్నారు. ప్రభుత్వం పాఠశాలలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ విధానాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

నియామకం

రేణుకా మాత గౌడ సంఘం అధ్యక్షుడిగా రవి

వేములవాడ: వేములవాడ రేణుకమాత గౌడం సంఘం అధ్యక్షుడిగా పొన్నం రవిచంద్రను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా వెంగ శ్రీకాంత్‌గౌడ్, కోశాధికారిగా విక్కుర్తి అంజయ్యగౌడ్, ముఖ్య సలహాదారులుగా పులి రాజుగౌడ్, పంజాల వెంకటేశ్వర్లు, బాలసాని తిరుపతి, ఉపాధ్యక్షులుగా మంద వెంకన్న, సార నర్సయ్య, బత్తిని నారాయణ, పులి రాంగోపాల్, కొత్తింటి దేవాగౌడ్, కార్యదర్శులుగా జాగిరి సురేశ్, నేరెళ్ల వినోద్, కోల శ్రీనివాస్, గౌరవాధ్యక్షులుగా వెంగళ అంజయ్యగౌడ్ ఎన్నుకున్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

- పీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు



మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

ముస్తాబాద్: సంక్షేమ పథకాల అమలులో అధికార బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని పీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్ రావు అన్నారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ పండగను ఆదివారం నిర్వహించి మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, అర్హులకు పింఛన్లు, దళితబంధు వంటి పథకాలను పేదలకు అందించలేకపోయారన్నారు. ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఎన్నికల హమీని నేరవేర్చకుండా మంత్రి కేటీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ రోజురోజుకు పెరుగుతుందన్నారు. 57 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని ఇవ్వలేదన్నారు. దళితబంధు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. భూస్వాములకే రైతుబంధు ఇస్తున్నారని, నాగలి పట్టి పనిచేసుకునే రైతులకు రైతుబంధు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి డిగ్రీ కళాశాల, 30 పడకల ఆసుపత్రి ఏమైందని ప్రశ్నించారు. భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పైరవీకారులకే బీఆర్‌ఎస్ పెద్దపీట వేసిందన్నారు. గ్రామగ్రామాన జెండా ఆవిష్కరణతో బలోపేతం అవుతున్నామన్నారు. పలువురు కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం బుడగజంగాల కాలనీలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, నాయకులు ఓరగంటి తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, భూపాల్ రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



చీకోడులో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలం చీకొడు, బందనకల్‌లో కాంగ్రెస్ జెండా పండగను ఆదివారం నిర్వహించారు. బందనకల్‌లో పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. డబుల్ బెడ్రూంలు, దళితబంధు ఇవ్వని బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, బుగ్గ రమేశ్, వుచ్చిడి బాల్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, నరేశ్, భాను, సురేశ్, రాములు, ఓంకార్, రాజు, రంజిత్, శంకర్, బాలకృష్ణ, ప్రశాంత్, సాగర్, ప్రేమ్, రామాగౌడ్, ప్రేమ్, విష్ణు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, గుగ్గిళ్ల శ్రీకాంత్, బద్దెనపల్లి నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంది



చెక్కును అందిస్తున్న నాయకులు

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గద్దల దుర్గప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ ప్రమాద బీమా పథకం కింద రూ.2 లక్షల చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా సురేందర్‌రావు మాట్లాడుతూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గొప్ప ఆలోచనతో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవాలని బీమా పథకం అమలు చేయిస్తున్నారన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యకర్తలకు కేటీఆర్ చేయూతనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీటీసీ శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ ప్రచారం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక, కొత్తపేట గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియచేశారు బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు సారంపల్లి రాజు, కొండం శ్రీనివాసరెడ్డి, ఐల మహేశ్, జనగం లక్ష్మన్, ఇల్లెందుల బాలయ్య పాల్గొన్నారు.

నూనావత్ రవి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఐడీ ఎస్పీ రాంరెడ్డి

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నూనవత్ రవి విగ్రహాన్ని సీఐడీ ఎస్పీ రాంరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి గ్రామంలో ఎన్నో సేవలు చేసినట్లు కొనియాడారు. నిరుపేదలకు అండగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ జిల్లా అధ్యక్షుడు రాంజీ నాయక్, రిటైర్డ్ సీఐ శంకర్ నాయక్, నవీన్, గోపి నాయక్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టిప్పర్‌పై యువకుడి దాడి

వేములవాడ: పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో ఓ యువకుడు ఆదివారం రాత్రి టిప్పర్‌పై దాడి చేసి అద్దాలు పగులగొట్టి పారిపోయాడు. పోలీసులు అక్కడికి చేరుకుని యువకుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

ఆర్థికసాయం

ముస్తాబాద్: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని ఆవునూర్‌కు చెందిన బండి నర్సాగౌడ్ కుటుంబానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

చిన్నారి చికిత్సకు..

వేములవాడ: గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన ఆవునూరి ప్రశాంత్–నీలిమ దంపతుల నాలుగు నెలల పసి బాబు చికిత్స కోసం మన వేములవాడ ట్రస్టు సభ్యులు రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

అన్నదానం

వేములవాడ: రాజన్న ఆలయ ప్రాంతంలో పేదలు, యాచకులకు మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు ఆదివారం 150 మందికి అన్నదానం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని సుబ్బుకు రూ.7,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు.

పరామర్శ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రి సర్పంచ్ పెండ్యాల తిరుపతి భార్య అరుణ మృతిచెందగా వారి కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పరామర్శించారు.

కోనరావుపేట: మండలం మల్కపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎర్రోళ్ల రేణవ్వ కుటుంబాన్ని చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు.

సమాచారం

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి వ్యాయామ పరీక్షలు

కోనరావుపేట/వీర్నపల్లి/ముస్తాబాద్: హైదరాబాద్ హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతులలో అడ్మిషన్ల కోసం మండల, జిల్లా స్థాయిలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు దూస రఘుపతి, పీడీ బుచ్చిరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ నెల 4న వీర్నపల్లి, ముస్తాబాద్, 7న కోనరావుపేట మండలం కనగర్తి పాఠశాలలో విద్యార్థులను ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 4, 5 తరగతుల విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని కోరారు. రన్నింగ్, షాట్‌పూట్, హైజంప్ వంటి ఈవెంట్స్‌లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని, అక్కడ జరిగిన ఈవెంట్స్‌లో ప్రతిభ చాటిన వారిని స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. ప్రతాప్ 99492 50618, అక్బర్ 77025 79180 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.